
ప్రజాశక్తి

శనివారం 13 సెప్టెంబర్ 2025 5

పార్వతీపురం మన్యం



గ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలోని అన్ని గిరిజన గ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహించాలని ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. శుక్రవారం మొబైల్ ఆధార్ క్యాంప్ నిర్వాహకులకు ఇచ్చే శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో సవరణల కోసం గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మొబైల్ ఆధార్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మొబైల్ ఆధార్ క్యాంపులను అంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మొబైల్ ఆధార్ క్యాంపులకు సంబంధించిన కిట్లను పిఒ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు అండగా... కష్టజీవులకు తోడుగా

- నేటి నుంచి సిఐటియు 11వ జిల్లా మహాసభ
- తొలిరోజు ర్యాలీ, సభలతో ఆరంభం
- హాజరు కానున్న సిఐటియు రాష్ట్ర నాయకులు నర్సింగరావు, సుబ్బరావమ్మ



మహాసభల వేదికను సిద్ధం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం/పాలకొండ

అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న ప్రపంచీకరణ చీకట్లను చీల్చుకుంటూ, కార్పొరేట్ కాఠిన్యాలను ప్రతిఘటిస్తూ ఎర్రజెండా నీడలో ఏర్పడిన సిఐటియు.. జిల్లాలో కార్మికులకు అండగా, కష్టజీవులకు తోడుగా నిలుస్తోంది. కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు, ఎన్నో విజయాలు, మరెన్నో ప్రగతిశీల లక్ష్యాలతో ముందుకు సాగుతున్న సిఐటియు మరో అడుగు ముందుకు వేస్తోంది. ఈ క్రమంలో సిఐటియు జిల్లా 11వ మహాసభలకు పాలకొండ పట్టణం సిద్ధమైంది.

జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమ జీగిరాం జూట్ మిల్లు మూతపడి మూడేళ్లు దాటిపోయింది. సుమారు రెండు వేల కార్మికుల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. పాలకుల నిర్లక్ష్యం, యాజమాన్యం మొండి వైఖరి కారణంగా జ్యూట్ మిల్లు మూతపడింది. గత ఎన్నికల ముందు బిల్లును తెరిపిస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చినా ఇంతవరకు ఏ విధమైన ఫలితమూ కనిపించడం లేదు. కార్మికులు చెట్టుకొకరు, పుట్టకొకరు చెల్లాచెదురై ఉపాధి వేటలో పడ్డారు. ఉపాధి హామీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు, దినసరి ఉద్యోగులపై వేధింపులు, తొలగింపులు జరిగాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎలు, కెజిబివి, మోడల్ పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపులు ఎక్కువగా కనిపించాయి. అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సుల కారణం చిరుద్యోగుల తొలగింపునకు వ్యతిరేకంగా సిఐటియు అనేక పోరాటాలు చేసింది. గడచిన మూడేళ్లలో జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు కాలేదు. జీగిరాం జూట్ మిల్లు మూతపడిన కారణంగా ఉపాధి కోల్పోయిన కార్మికులకు ప్రభుత్వం ఏ విధమైన భరోసా ఇవ్వలేదు. జిల్లాలో అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులు, వ్యవసాయ కూలీలు అధికంగా వున్నారు. వీరి హక్కులు, ప్రయోజనాల కోసం సిఐటియు ఆధ్వర్యాన పోరాటం సాగించింది.

మన్యం జిల్లాలో గడిచిన మూడేళ్లలో సిఐటియు ఆధ్వర్యాన అనేక పోరాటాలు చేశారు. అంగన్వాడీల 42 రోజుల సమ్మె, మున్సిపల్ కార్మికులు 16 రోజుల సమ్మె, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల 22 రోజులు సమ్మెల కారణంగా సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైంది. జిల్లాలో సిఐటియు ప్రతిష్ఠ పెరిగింది. జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపునకు నిరసనగా పోరాటం చేసి 2వేల మందితో భారీ ర్యాలీ చేపట్టారు. ఫలితంగా ఫీల్డ్ అసిస్టెంట్లపై పని ఒత్తిడి తగ్గింది. మధ్యాహ్న భోజనం కార్మికులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, వాచ్మెన్ ,కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యల కోసం పోరాటం నడిచింది, చింతపిక్కల తీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సుదీర్ఘ పోరాటం జరిగింది. ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి 8 నెలలు జీతం కోసం పోరాడిన ఫలితంగా వారి సమస్య పరిష్కారమైంది. హెల్త్ సెక్రెటరీలు, గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై పోరాటం నడిచింది. సిహెచ్ డబ్ల్యుల బకాయి జీతాల కోసం దీక్షలు జరిగాయి. ఆశా వర్కర్ల పని వేధింపులపై చేపట్టిన పోరాటం వల్ల పని ఒత్తిడి తగ్గింది. అంగన్వాడీల ప్రమోషన్లపై పోరాటంతో సమస్య పరిష్కారానికి అధికారులు ముందుకొచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ స్వీపర్ల బిల్లుల కోసం పోరాటాలు నిర్వహించారు. ఆర్టీసీ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై 8 రోజులు రెండు దఫాలుగా పోరాడి సమ్మె చేయడంతో వారి జీతాల పెంపునకు యాజమాన్యాలు అంగీకరించాయి. మున్సిపాలిటీలో కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని పోరాడి విజయం సాధించింది. ఇలా గతంలో సాధించిన విజయాలతో పాటు భవిష్యత్తులో చేపట్టబోయే ఉద్యమాలపై ఈ మహాసభలో చర్చించనున్నారు. మొదటిరోజు శనివారం ఉద్యోగ, కార్మికులతో భారీ ర్యాలీ జరగనుంది. అనంతరం బహిరంగసభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ప్రసంగించనున్నారు. రెండురోజు ప్రతినిధుల చర్చలు, భవిష్యత్తు కార్యాచరణ, తీర్మానాలతో పాటు నూతన కార్యవర్గం ఎన్నికవ్వనుంది. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దావాల రమణరావు, వై.మన్మధరావు ఆధ్వర్యాన మహాసభకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎమ్మెల్యేల సిఫార్సులకే ఉద్యోగాలు

ఇంటర్వ్యూలు నామమాత్రమేనన్న ప్రచారం
ఒక్కో ఉద్యోగానికి ముగ్గురు దరఖాస్తు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఆశా కార్యకర్తల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు శుక్రవారం స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశమందిరంలో జరిగాయి. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 34 ఆశా కార్యకర్తల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఇందుకు 94మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పంచాయితీ సర్పంచ్, స్థానిక పిహెచ్ సి వైద్యాధికారుల ధ్రువీకరణతో ఆశా కార్యకర్తల ఉద్యోగాలకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ మహిళలు స్థానికులై వుంటే ఉద్యోగానికి అర్హులని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. భర్తలు కోల్పోయిన, ఒంటరి మహిళలకు ఈ ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలని నిబంధనలు ఉన్నాయి. నెలకు రూ.10వేలు వేతనం లభించే ఆశా కార్యకర్త ఉద్యోగాలకు డిమాండ్ అధికంగా వుంది. సొంత ఊరిలో వుంటూ పని చేస్తే రూ.10వేలు లభించడంతో నిరుద్యోగ మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఈ ఉద్యోగాలు ఆశిస్తున్న వారిలో ఎక్కువ మంది వివాహితులే వున్నారు. శుక్రవారం ఆశా కార్యకర్తల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను సబ్ కలెక్టర్ వైశాలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సమక్షంలో నిర్వహించారు. అయితే ఈ ఉద్యోగాలకు ఎంపికలు ఏ మేరకు పారదర్శకంగా జరుగుతాయన్నది ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆశావహ అభ్యర్థులు స్థానిక అధికార పార్టీ నాయకుల అండదండలతో నియోజకవర్గ ఎమ్మెల్యేలను కలిసి ఎంపికకు మార్గం సుగమం చేసుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అధికారపార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులున్న వారికే ఉద్యోగాలు లభిస్తాయనే ప్రచారం జరుగుతోంది. ఒక్కో ఉద్యోగానికి లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వారికే ఉద్యోగాలు లభిస్తాయనే వాదనలు బలంగా వినిపిస్తుండడంతో ఇంటర్వ్యూలు నామమాత్రమేనని తెలుస్తోంది. నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఎంపికలు జరగవనేది స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే తోణాం పిహెచ్‌సి పరిధిలో తోణాంకు చెందిన ఎస్సీ వితంతు మహిళ ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేశారు. తాను వితంతు మహిళనని ఆశా కార్యకర్త ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ లో ఆమె కోరారు.

అయితే స్థానిక అధికార పార్టీ నాయకుల సిఫార్సుతో ఓ ప్రభుత్వ ఉద్యోగి భార్యకు ఖరారైందనే ప్రచారం జోరుగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందనే వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఎంపిక చేస్తే తమకు ఆశా కార్యకర్త పోస్ట్ దక్కుతుందనే ఆశతో చాలా మంది నిరుద్యోగ నిరుపేద మహిళలు ఎదురు చూస్తున్నారు.



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులతో మాట్లాడుతున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ : జెసి

ప్రజాశక్తి - వీరఘట్టం

జిల్లాలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా, ఎరువులు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలకొండ రెవిన్యూ డివిజన్‌లోని వీరఘట్టం రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ చేస్తున్న ఎరువుల పంపిణీ ప్రక్రియను జేసీ స్వయంగా పరిశీలించారు. ఎరువుల కొరకు రైతులు వేచి ఉండకుండా ఉండేందుకు తీసుకు వచ్చిన స్లాట్ బుకింగ్ విధానాన్ని ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు, మార్గదర్శకాలను జారీచేశారు. అనంతరం ఎరువులు పొందిన రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని అన్నారు. ఎరువుల పంపిణీలో రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన జిల్లా కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని సూచించారు. ఈ పర్యటనలో మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



యూరియా కోసం క్యూలో నిరీక్షిస్తున్న రైతులు

యూరియా కోసం పడిగాపులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి శుక్రవారం 550 బస్తాలు యూరియా రావడంతో రైతులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఉదయం నుంచి పడిగాపులు కాసినా కొంతమందికే యూరియా దొరికింది. పోలీస్ భద్రత నడుమ రైతులకు పాసుపుస్తకానికి ఒక్కొక్క బస్తా చొప్పున విక్రయించారు. రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందకపోవడంతో ఆందోళన చెందారు.

బిజెపి తీరుతో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

సీతారాం ఏచూరి వర్ధంతి సభలో ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం, లౌకిక వాదం, ప్రజాస్వామ్యం, ఫెడరలిజం ప్రమాదంలో పడ్డాయని, ఆర్థిక వ్యవస్థ కూడా కుంటుపడుతోందని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం పూర్వ జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ శుక్రవారం స్థానిక ఎంపి ఎన్‌జిఒ హోంలో గురజాడ అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.మురళీమోహన రావు అధ్యక్షతన జరిగింది. తొలుత ఏచూరి చిత్ర పటానికి పూమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత బిజెపి ఫాసిస్టు, మతోన్మాద ధోరణి నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సి ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని పార్టీలు బిజెపికి సాగిలపడుతున్నాయన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే తెలుగు రాష్ట్రాల్లో బిజెపి విస్తరణకు అవకాశం ఇచ్చిన వారవుతారని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తెలుగుదేశం కంటే ముందే వైసిపి మద్దతు ప్రకటించిందని విమర్శించారు. అంత అవసరం ఏమొచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. దేశంలో సోషలిజం ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నా సీతారాం ఏచూరి మార్క్సిస్టు భావజాలాన్ని ముందుకు తీసుకెళ్ళారన్నారు. ఆయన స్ఫూర్తితో భవిష్యత్ కర్తవ్యాలను నిర్వహించాలని సూచించారు. ఏచూరి మరణించారనే విషయాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నామని వివరించారు. ఈ ఏడాది కాలంలో భారత రాజకీయాల్లో వస్తున్న పెనుమార్పులు, అభ్యుదయ, లౌకిక, ప్రజాస్వామ్యశక్తులు వారి పాత్రను ముందుకు తీసుకెళ్లడంలో ఏచూరి లేనిలోటు కనిపిస్తోందని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె.మురళి, పక్కి రవీంద్ర, నీరస శ్రీనివాసరావు, లక్ష్మణ్ నాయుడు, సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, బివి రమణ, వి.ఇందిర, ఎం.ఉమామహేశ్వరి, బి.సూరిబాబు, రెడ్డి శ్రీదేవి, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, పి.రాము, ఎస్ఎఫ్ఐ నాయకులు టి.అఖిల్, సురేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్/మక్కువ : దేశంలో సోషలిస్ట్ సమాజ స్థాపనకు, అనేక త్యాగాలతో సాధించుకున్న రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ద్వారానే దేశంలో లౌకిక విలువలు నిలబడతాయని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు అన్నారు. సాలూరు పట్టణం, మక్కువలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలు శుక్రవారం జరిగాయి. తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్వై నాయుడు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మనకు దూరమై ఏడాదైనా దేశ రాజకీయాల్లో ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక, సామాజిక న్యాయం, సమానత్వంపై ఆర్ఎస్ఎస్, దాని మాతృ సంస్థలు దాడులు చేస్తూనే ఉన్నాయని, వీటి నుంచి రాజ్యాంగాన్ని కాపాడడమే మనందరి కర్తవ్యంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తుపాకుల వెంకటరావు, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శంకరు, రవి కోశాధికారి రాముడు, మహిళా కో కన్వీనర్ స్వప్న, సీత, మీడియా ఇంఛార్జి శ్రీనివాస్, మక్కువ మండల సిఐటియు నాయకులు జి.కృష్ణారావు అధ్యక్షతన జరిగింది. స్థానిక మండల ఆటో యూనియన్ నాయకులు ఎస్.నాగరాజు, జయ, వంశీ, టి.తేజ, పి.మధుకుమార్, బి.శ్రీను, బి.సింహాచలం, పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కృష్ణమూర్తి, నివాళ్లు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బట్టివలసలో

సాలూరు మండలంలోని బట్టివలసలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ జరిగింది. తొలుత ఏచూరి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ప్రజా పోరాటాలు నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని దేశంలో పేదలు కష్టజీవులు కార్మికులు బడుగు జీవుల కోసం ఎనలేని కృషి చేశారని, ఆయన ఆశయాలు సాధన కోసం అందరూ కషి చేయాలని కార్యక్రమంలో పార్టీ సభ్యులు వంతల శివ, చిన్న, మర్రి రాజు, వంతల రమేష్, సాంబ, భీమయ్య , రామారావు, వంతల తులసమ్మ, వంతల కుమారి, మర్రి సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: మండల కేంద్రంలోని సీతారాం ఏచూరి వర్ధంతి సభ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ మతసామరస్యం, లౌకిక, దేశసార్వభౌమత్వ పరిరక్షణే ఏచూరికి నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య, నాయకులు సోమయ్య, ప్రజాసంఘాల నాయకులు రంజిత్ కుమార్, జగన్నాథం, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేటలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సిపిఎం నాయకులు కె.లక్ష్మణ, సిహెచ్ శంకర్రావు, రాయిపల్లి రాము ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చొంగలు శంకరరావు, రామయ్య, గౌరమ్మ, పార్వతి, లక్ష్మి, పుష్ప పాల్గొన్నారు.



సాలూరులో సీతారాం ఏచూరికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



కామయ్యబంద మ్యాప్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

కామయ్య బందను పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గల కామయ్య బందను సబ్ కలెక్టర్ వైశాలి రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కామయ్య బంద విస్తీర్ణం గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బందకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి పరిసర ప్రాంతంలో ఉన్న నివాస గృహాలు, వాణిజ్య సముదాయాల కట్టడాల సమాచారాన్ని రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బందలో నీళ్లు నిల్వ ఉంచి, పరిసరాలన పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉందా అన్న విషయాన్ని పరిశీలించాలని సూచించారు. బందలోకి వచ్చే వాడుకనీరు వెళ్లే మార్గంపై ఆరా తీశారు. అనంతరం వరహాల గెడ్డ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి వరద ఉధృతికి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్‌తో పాటు, తహశీల్దార్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్, రెవెన్యూ సర్వేయర్, సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

డిఐపిఆర్‌ఒగా బాలమాన్ సింగ్

ప్రజాశక్తి - పార్వతీపురం

సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా క్షత్రి బాలమాన్‌సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు డిఐపిఆర్‌ఒగా వ్యవహరించిన ఎల్.రమేష్ ఉద్యోగోన్నతిపై గుంటూరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సింగ్‌ను నియమిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. 2019 - 21 మధ్య కాలంలో పార్వతీపురం డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా బాలమన్ సింగ్ పనిచేశారు. 2022లో శ్రీకాకుళం జిల్లా పౌర సంబంధాల అధికారిగా ఉద్యోగోన్నతి పొంది, ప్రస్తుతం పాడేరు జిల్లా పౌర సంబంధాల అధికారిగా కొనసాగుతున్నారు. ఉద్యోగోన్నతిని కల్పిస్తూ పార్వతీపురం సమాచార శాఖలో సహాయ సంచాలకులుగా నియమించబడ్డారు.

సంతనర్సిపురంలో వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని సంత నర్సిపురంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి సాయి కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, చిన్నారులు, బాలింతలు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్యతనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర పండగగా కోట దుర్గమ్మ ఉత్సవాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

కోట దుర్గమ్మ వారి దసరా ఉత్సవాలను రాష్ట్ర పండగ్గా చేస్తామని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక కోట దుర్గమ్మ వారి ఆలయంలో దసరా ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు ఎంతో వైభవంగా జరపాలన్నారు. ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతున్న ఈ ఉత్సవాలు ఘనంగా జరిగేలా చూడాలన్నారు. అందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ స్వప్నల్ పవర్ మాట్లాడుతూ ఉత్సవాలు సందర్భంగా పట్టణంలో పారిశుధ్యం నిర్వహణలో ఎక్కడా లోపం లేకుండా చూడాలన్నారు. నగరపంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు మాట్లాతూ వచ్చిన యాత్రికులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చూడాలన్నారు. ఈ ఉత్సవాలు ఘనంగా జరిగేందుకు తన వంతు పూర్తి సహకారాలు అందిస్తానన్నారు. సీనియర్ రాజకీయ నాయకుడు పైడి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కోట దుర్గ ఆలయ ప్రాంగణంలో మల్లికార్జున నిర్మాణానికి రూ.50 లక్షలు విరాళంగా అందిస్తానన్నారు.

కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పడాల భూదేవి, ఎంపిపి బొమ్మల భాను, చైర్ పర్సన్ ఆకుల మల్లేశ్వరి, డిఎస్‌పి ఎం.రాంబాబు, రాధాకృష్ణమూర్తి, ఎస్సై ప్రయోగమూర్తి, ఆలయ ఇఒ సూర్యానారాయణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, జి.రామినాయుడు, జాడ శ్రీధర్ గర్భాన సత్తిబాబు, రాజేష్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తాం

డయల్ యువర్ కార్యక్రమంలో డిపిటిఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ప్రజా రవాణాధికారి కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ ప్రజా రవాణాధికారి కార్యక్రమానికి 26 వినతులు ఫోన్ ద్వారా వచ్చాయి. ఈ సందర్భంగా ప్రజా రవాణాధికారి మాట్లాడుతూ ఉన్నతాధికారులను సంప్రదించి సాధ్యమైనంత వరకూ పల్లెలకు, చివరి గ్రామాలకు బస్సు సౌకర్యం, అలాగే స్టాపుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వచ్చిన వినతుల్లో కొన్ని....

విశాఖపట్నం - పార్వతీపురం చివరి ట్రిప్‌ను పార్వతీపురం టౌన్లోకి వచ్చేలా ఏర్పాటు చేయలని పార్వతీపురానికి చెందిన వి.శ్రీహరి కోరారు. పార్వతీపురం నుంచి దుగ్గేరుకు అదనంగా రెండు బస్సు సర్వీసులు పెంచాలని దుగ్గేరుకు చెందిన జి.జనార్ధనరావు కోరారు. పార్వతీ పురం నుంచి పెద్దబుడ్డిడికి బస్సు సౌకర్యం కల్పించాలని పెద్దబుడ్డిడికి చెందిన ఆర్.రాజు, మక్కువ నుండి విశాఖపట్నం, దుగ్గేరు - బొబ్బిలి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించమని దుగ్గేరుకు బి.రామకీష్ణ, కె. సీతారాం కోరారు. అలాగే పాలకొండ నుండి గుమ్మలక్ష్మీపురం వయా వీరఘట్టం, జియ్యమ్మవలస మీదుగా, పాలకొండ - కురుపాం గ్రామాలకు మరొక బస్సు సర్వీస్ ను పెంచాలని, అలాగే పార్వతీపురం -జియం వలస వరకు ఉన్న బస్సు సర్వీస్‌ను వీరఘట్టం వరకు పొడిగించాలని వీరఘట్టంకు చెందిన ఎస్.లక్ష్మ నాయుడు ఫోన్ ద్వారా రవాణాధికారిని కోరారు. అలాగే బొబ్బిలి బస్సు స్టేషన్లో టాయిలెట్ ఛార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని, సాలూరు, బొబ్బిలి కాంప్లెక్స్‌ల్లో మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారు. చీపురుపల్లి పార్వతీపురం మధ్య బస్సు సౌకర్యం, విశాఖపట్నం - జైపూర్ వయా అలమండ మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు తిరుమల సాయి విద్యార్థి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పెదమేరంగి తిరుమల సాయి హై స్కూల్లో 8వ తరగతి చదువుతున్న నిమ్మల జితేంద్ర అండర్-14 ఫెన్సింగ్ క్రీడా, ఫోయిల్ వ్యక్తిగత విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఉమ్మడి జిల్లా విజయనగరం విజ్జీ ఇండోర్ స్టేడియంలో జరిగిన 69వ పాఠశాల జిల్లా స్థాయి యు-14 ఫెన్సింగ్ క్రీడల్లో గెలుపొందినట్లు తెలిపారు. విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల స్కూల్ కరెస్పాండెంట్, ప్రిన్సిపల్, కోచ్ అభినందనలు తెలిపారు.

అడ్డాకులగూడలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని అడ్డాకులగూడలో జెమ్స్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. అడ్డాకులగూడ గిరిజన గ్రామంలో ఎక్కువ మంది బాధితులు కిడ్నీ రోగంతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో జెమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు వైద్యుల సమక్షంలో బాధితులందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి, జెమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ గిరి, కుసుమి వైద్యాధికారి డాక్టర్ చాందిని, ఆశా వర్కర్లు, ఇతర టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లంబేసులో ఉపాధి హామీ పనులకు సంబంధించి వారం రోజులు పాటు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనుల తీరు, వేతనదారుల వివరాలు, ఉపాధి కూలీల వేతనం చెల్లింపులు వంటి అంశాలపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. చేసిన సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి తోయక సీతమ్మ, పంచాయతీ కార్యదర్శి వి.శ్రీకాంత్, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగిలో అదే గ్రామానికి చెందిన పొట్నూరు లక్ష్మణరావు సుమతి దంపతులు వారి కుమారుడు కీర్తిశేషులు ముఖేష్ జన్మదినం సందర్భంగా జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.20,000 విలువ గల పెన్నులు, జామెంట్రీ బాక్సు, అట్టలు, మిఠాయి శుక్రవారం పంచిపెట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యలో బాగా ఎదగాలని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వినాలని, క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో మంచి విద్యార్థులుగా నిలవాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.నాగమణి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ,పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణతో మహిళల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

కుట్టు మిషన్ శిక్షణతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధ్యమని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం కల్పిస్తున్న ఇటువంటి శిక్షణలను మహిళలు సద్వినియోగం చేసుకుంటే ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడవచ్చునన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు నాగభూషణ్, గోవిందరావు, శిక్షణాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎఎంఒకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా ఉంటూ ఐటిడిఎ పిఎంఆర్‌సి బృందంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఎఎంఒ)గా పనిచేస్తున్న పి.కోటిబాబు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ శుక్రవారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ హెచ్ఎంగా ఉత్తమ పనితీరు కనబరచాలని కోటిబాబుకు సూచించారు. పాలకొండ మండలం బడ్డుమాసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్ఎంగా నియమించారు.

స్వమిత్వ సర్వేపై సాంకేతిక శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమిత్రా సర్వేపై శుక్రవారం సాంకేతిక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ ఎం.నాగభూషణరావు మాట్లాడుతూ గ్రామంలో ఉండే వివిధ రకాల ఇళ్లు, ఇళ్ల స్థలాలు ప్రభుత్వ స్థలాలు కొలతలపై ప్రభుత్వ నిబంధన ప్రకారం సర్వే ద్వారా నిర్ణయం జరుగుతుందన్నారు. మ్యాపింగులో ఉండే కొలతలు, భూమ్మీద ఉండే కొలతలు డ్రోన్ సర్వేలో ఉండే కొలతలు అంశాలను కంప్యూటర్ చేసుకొని వాటి విలువలను తెలుసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిడిఒ కెకె కుమార్ వర్మ, టిఒటిఎం రాజేష్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ఇంజనీరింగ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

13,14 తేదీల్లో హిందీ పరీక్షలు

ప్రజాశక్తి -కురుపాం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13, 14 తేదీల్లో హైదరాబాద్ హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో విశారద, భూషణ్, విద్వాన్ పరీక్షలు నిర్వహిస్తారని హిందీ కేంద్ర వ్యవస్థాపకులు సంతోష్ కుమార్ పండా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు ముఖ్య పర్యవేక్షకుడిగా హెచ్ఎం టి.శంకరరావు, పర్యవేక్షణ అధికారిగా ఎంఇఒ సత్యనారాయణ వ్యవహరిస్తారన్నారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

కార్పొరేషన్ డైరెక్టర్‌గా బొమ్మినేని

ప్రజాశక్తి సీతానగరం

స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టుగా మండలంలోని జోగంపేట గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకులు బొమ్మినేని లక్ష్మీనారాయణ శుక్రవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. తనకు సహకరించిన జిల్లా నాయకులకు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు మండల నాయకులు గ్రామ నాయకులు అభినందనలు తెలిపారు

15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 15 నుంచి 30 వరకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల వేయనున్నామని, వీటిని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కురుపాం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ఎల్.సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పశుసంవర్ధక సహాయకులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో టీకాల కార్యక్రమం, లింగ నిర్ధారిత ఇంజక్షన్ బాధ్యతగా పాడిరైతులు పశువులకు చేయించాలన్నారు. అలాగే కోళ్లకు వచ్చే వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించి, వర్షాకాలంలో పశువుల సంరక్షణ చర్యలను వివరించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు డా.కె.శైలజ, లక్షణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తెన్నుఖర్జలో కింగ్ కోబ్రా కలకలం

ప్రజాశక్తి - కురుపాం



ఇంట్లోకి చేరిన కింగ్‌కోబ్రా

మండలం లోని గొటివాడ పంచాయతీ తెన్నుఖర్జలో శుక్రవారం తిమ్మక సోమందొర ఇంట్లో 12 అడుగుల గిరినాగు (కింగ్ కోబ్రా) కనిపించింది. దీన్ని చూసి గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఆటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చే లోపు సమీప అడువుల్లోకి తిరిగి పాము వెళ్లిపోయింది. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఇటీవల గిరి నాగులు (కింగ్ కోబ్రా) ఎక్కువగా కనిపించడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

మీకై మేము స్వచ్ఛంద సంస్థకు అవార్డుల వర్షం

ప్రజాశక్తి - సాలూరు రూరల్

దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ 37వ వార్షికోత్సవ సందర్భంగా పట్టణానికి చెందిన మీకై.. మేము వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ గౌరమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ అందించిన సేవలకు గానూ 10 మంది సభ్యులకు అరుదైన గౌరవం లభించిందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఇప్పిలి దిలీప్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపికైన వారిలో ఎడ్ల మహేష్, పంచాది శ్రీనివాసరావు, గౌడు ఈశ్వరరావు, కుందుల వసంత కుమార్, వంక మనోజ్ కుమార్ పసుమర్తి నరేష్, మద్దుల భార్గవ్; బొ్రా కృష్ణవేణి, వెలగంశెట్టి అనిల్‌కుమార్, పి బి ఎస్ చంద్రశేఖర్ రాజు ఉన్నారు.

విజ్ఞాన పండగకు సర్వం సిద్ధం

నేటి నుంచి రెండు రోజులపాటు జెవివి రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జెవివి మహాసభ ప్రాంగణం వద్ద స్వాగతం ద్వారం

జన విజ్ఞానవేదిక 18వ రాష్ట్ర మహాసభలు నగరంలో నేటి నుంచి రెండు రోజులు పాటు జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి. మహాసభలకు వేదిక కానున్న జిల్లా పరిషత్ సమావేశ మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిద్దారు. జెడ్‌పి ప్రాంగణం వద్ద అతిథులకు, ప్రతినిధులకు ఆహ్వానం పలుకుతూ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ప్రాంగణం లోపల, బయట, నగరంలోని పలు కూడళ్లలోనూ మహాసభల ప్రాధాన్యత, కర్తవ్యాలు, హాజరు కాబోయే ముఖ్యవక్తలు తదితరాలతో కూడిన హోర్డింగ్ బోర్డులను, గోడపత్రికలను ఏర్పాటు చేశారు. మరోవైపు హాజరుకానున్న 400మంది ప్రతినిధులకు భోజనాలు, విడిది సౌకర్యం వంటివి ఏర్పాటు చేశారు. ఈ రెండు రోజులపాటు అన్ని ఏర్పాట్లు, సాయం చేసేందుకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు వాలంటీర్లుగా వ్యవహరించనున్నారు. ఇప్పటికే వీరంతా ఆయా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా మహాసభల్లో గడిచిన రెండేళ్లలో జన విజ్ఞాన వేదిక చేసిన కృషి, ఫలితాలను సమీక్షించుకోవడంతో పాటు భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోనున్నారు. మహాసభలకు ముఖ్య అతిథిగా ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ ప్రధాన కార్యదర్శి (ఎఐపిఎస్ఎన్) ఆశామిశ్రా, ప్రధాన వక్తగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ హాజరు కానున్నారు. మహాసభల ప్రారంభ సూచికగా జెవివి జెండాను నారు సింహాద్రినాయుడు, అభ్యుదయ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు, జాతీయ జెండాను ప్రముఖ వయొలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌రావు ఆవిష్కరించనున్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు ఆహ్వానం పలకనున్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు (జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి) డివి రమణ స్వాగతోపన్యాసం చేస్తారు. జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సందేశాలు ఇవ్వనున్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర సమగ్రాభివృద్ధి అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఉపన్యాసం చేయనున్నారు. రెండో రోజు ఉదయం 5:30గంటల నుంచి 7.30 గంటల వరకు మహాసభల్లో పాల్గొన్న ప్రతినిధులంతా నగరంలో సైన్స్‌వాక్ చేయనున్నారు. హోటల్ మయూర పరిసర ప్రాంతం నుంచి ట్యాంక్‌బండ్ రోడ్డు, బాలాజీ జంక్షన్, కోట మీదుగా గురజాడ నివాసం మీదుగా సంగీత కళాశాల వరకు సైన్స్ వాక్ నిర్వహిస్తారు. గురజాడ ఇంటిని కాపాడాలని, సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, గురజాడ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ వాక్ జరుగుతుంది. 9గంటలకు తిరిగి ప్రతినిధుల సభ పున:ప్రారంభమౌతుంది. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ కీలక ఉపన్యాసం చేయనున్నారు. అనంతరం కార్యదర్శి నివేదికపై చర్చలు, యూత్, సమతా సెషన్స్, కీలక తీర్మానాలు ఉంటాయి. మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రమణ్యం ముగింపు ఉపన్యాసం చేయనున్నారు. మహాసభల్లో రెండు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నారు.



వేదిక వద్ద సిద్ధం చేసిన ఏర్పాట్లు

అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు

కలెక్టర్ ఆత్మీయ వీడ్కోలు సభలో జిల్లా అధికారులు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా అభివృద్ధిలో తనదైన పరిపాలనా విధానాలతో జిల్లా ప్రజలు, అధికారులందరి మన్ననలు పొంది చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అని జిల్లా అధికారులు ప్రశంసలు కురిపించారు. జిల్లా ఆవిర్భావం తరువాత రెండో జిల్లా కలెక్టరుగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించి తనదైన ముద్రను వేశారని కొనియాడారు. జిల్లా కలెక్టరుగా సేవలందించి బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు అభినందన సభ శుక్రవారం స్థానిక ప్రైవేటు కన్వెన్షన్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ వెనుకబడిన మన్యం జిల్లా సమగ్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషి, పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన జిల్లాకు అందించిన సేవలు అమోఘం, అద్వితీయమని కొనియాడారు జిల్లాలో ఒక విజన్ తో కంటైనర్ ఆసుపత్రి, కంటైనర్ అంగన్వాడీల ఏర్పాటు, ఆసుపత్రులు, వసతి గృహాలు, పాఠశాలల మార్పుకు శ్రీకారం చుట్టారని అన్నారు. జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్, ఎనీమియా కమిటీలు ఏర్పాటుచేసి రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు, గిరిజన గ్రామాలకు రహదారులు, సెల్ టవర్ల ఏర్పాటుకు కషి మరువలేనిదని అన్నారు. నాలుగు బ్లడ్ బ్యాంకులు, సికిల్ సెల్ ఎనిమియా నిర్ధారణ పరీక్షా యంత్రాలను తెప్పించడం, ఏడు ఆసుపత్రులను అప్ గ్రేడ్ చేయడం, విద్యారంగంలో పదో తరగతిలో వరుసగా మూడవ సారి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిపి హ్యాట్రిక్ సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్ వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎఎస్‌పి అంకిత సురానా, డిఆర్ఒ కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, డిఆర్‌డిఎ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు ఎం సుధారాణి, కె.రామచంద్రరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథ రావు, డిపిఒ టి.కొండలరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, ఐసిడిఎస్ పీడీ టి.కనక దుర్గ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి వై.నాగేశ్వర రావు, డిఇఒ బి.రాజ్ కుమార్, వివిధ అసోసియేషన్ల అధ్యక్షులు,రెవిన్యూ అధికారులు, ఎంపిడిఒలు, ఇతర జిల్లా అధికారులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు.

వీరఘట్టంలో భారీ వర్షం

జలమయమైన ప్రధాన రహదారులు.. ఇళ్లలోకి మురుగునీరు

ప్రజాశక్తి - వీరఘట్టం



వీరఘట్టం దళితకానీలోని ఇళ్లలోకి చేరిన మురుగునీరు

మండలంలోని శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఎప్పుడూ లేని విధంగా వీరఘట్టంలో భారీ వర్షం కురవడంతో ప్రజలు బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో మేజర్ పంచాయతీలోని ప్రధాన రహదారులు, వీధిలోని రోడ్లు జలమయమయ్యాయి. అంతే కాకుండా గృహాల్లోకి మురుగు నీరు చేరుకోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రతిసారి వర్షం పడితే ఇదే పరిస్థితి ఏర్పడుతుందని, పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నపాటి చినుకు పడ్డా రోడ్డుపైకి చేరిపొంగి పొర్లుతుంది. కాలువలకు ఆనుకుని ఉన్న గృహాలు జలమయంతో నిండుకుంటున్నాయి. మేజర్ పంచాయతీ పరిధిలోని నత్తల, ఊజుల, రామారావు వీధుల్లో మురికి నీరు రహదారులపైన, ఇళ్లలోకి చేరుతుందని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో దళిత వీధుల్లో ఇదే పరిస్థితి వస్తుందని ఆరోపిస్తున్నారు. పేరుకే మేజర్ పంచాయతీ తప్ప పంచాయతీ పరిధిలో ఉన్న దళిత వీధులు మాత్రం అభివృద్ధికి ఆమడ దూరాన ఉన్నాయి.

సీతంపేటలో కుండ పోత వర్షం

సీతంపేట : మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడు గంటల వరకు ఏకధాటిగా కుండ పోత వర్షం కురిసింది. ఈ వర్షంతో విద్యార్థులకు, ప్రయాణికులకు, వ్యాపారకులకు కొంత ఆటంకం కలిగింది. వర్షంతో పొలాల్లో గెడ్డల్లో వాగుల్లో వర్షపు నీరు పొంగిపొర్లుతుంది. పసుపు అల్లం అటవీ ఉత్పత్తులకు ఈ వర్షం ఎంతో అనుకూలం ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలపై సభ్యుల నిలదీత

ప్రజాశక్తి - సీతానగరం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సర్పంచులు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి బలగ రవణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో వివిధ సమస్యలపై ప్రజలు ఎదుర్కొంటున్న వాటిని ఎంపిటిసిలు, సర్పంచులు అధికారుల ముందు ప్రస్తావించారు. ఇందులో భాగంగా లచ్చపేట ఎంపిటిసి సభ్యులు ఎ.సింహాచలం, సీతారాంపురం సర్పంచ్ విజయ మాట్లాడుతూ గ్రామాల్లో మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాలు మార్చాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అలాగే పొదుపు సంఘాల మహిళలకు వారి పొదుపు చేస్తున్న డబ్బులకు బ్యాంకులో అధికారులు వడ్డీ లేదు కానీ బ్యాంకు అప్పులు ఇచ్చిన వాటికి వడ్డీ వేస్తున్నారని తీసుకున్న అప్పును సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ కొన్ని పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజీలు రావడం లేదని, వీటిపై వెలుగు అధికారులు వివరించాలని డిమాండ్ చేశారు. కృష్ణయ్యపురం, పాపంవలస సర్పంచులు గుణుపూరు అన్నంనాయుడు, ఎం.గౌరునాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ సౌకర్యాలు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. చెల్లంనాయుడు వలస సర్పంచ్ వాకాడ పారమ్మ మాట్లాడుతూ గ్రామంలో మంచినీరు ట్యాంక్ కొత్తగా మంజూరు చేయాలని చేయాలన్నారు. రైతులకు యూరియా సకాలంలో అందించాలని కోరారు. వివిధ అంశాలపై మండల సమావేశంలో ప్రస్తావించారు. సమావేశంలో జడ్పిటిసి ఎం.బాబ్జీ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కెకె కుమార్‌వర్మ, తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్, వివిధ మండల స్థాయి అధికారులు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లోకేష్ కృషి ప్రశంసనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు చేరవేయడంలో మంత్రి నారా లోకేష్ చేసిన కృషి ప్రశంసనీయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలుగువారికి ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రమాదం తలెత్తిన ముందడుగు వేసి వారిని కాపాడే ధైర్యసాహసాలు ఆయన నాయకత్వానికి ప్రత్యేకత అని కొనియాడారు. నేపాల్‌లో తెలుగువారు చిక్కుకున్నట్లు సమాచారం అందిన వెంటనే అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని సహాయక చర్యలు చేపట్టడం లోకేష్ మానవతా దృక్పథాన్ని చాటిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ సుమారు 215 మంది తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి రప్పించడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారని, ఇది ప్రతి తెలుగు కుటుంబానికి గర్వకారణమని అన్నారు. కురుపాం నియోజకవర్గం నుంచి నేపాల్ పర్యటనకు వెళ్లిన పర్యాటకులను క్షేమంగా వారి స్వస్థలాలకు పంపించిన నారా లోకేష్ కు నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీతంపేట: నేపాల్ చిక్కుకుపోయిన వారిని తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు చేరవేయడంలో మంత్రి నారా లోకేష్ చేసిన కృషి ప్రశంసనీయమనిపాలకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ పడాల భూదేవి అన్నారు. గతంలో ఉత్తరకాండ వరదల్లో చిక్కుకు పోయిన తెలుగువారిని తీసుకురావడంలోను, గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని స్వదేశానికి తీసుకురావడంలో సిఎం చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించారని కొనియాడారు.

రోడ్డు విస్తరణ సర్వే వేగవంతం

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు విస్తరణలో భాగంగా మండలంలో గల అంతర్రాష్ట్ర రహదారి సర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మండలానికి ఆనుకొని ఉన్న ఒడిశా అంతర్ రాష్ట్ర రహదారి నాలుగు రోడ్ల విస్తరణకు ప్రభుత్వం ఏర్పాట్లపై కసరత్తు చేస్తుంది. శుక్రవారం కొమరాడ మండలం కోటిపాం అంతర్రాష్ట్ర రహదారి వద్ద భోపాల్‌కు చెందిన ఎల్ఎం మాల్వి కంపెనీ నిర్వాహకులు సర్వే చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్వే బృందం సభ్యులు పవన్ యూకి మాట్లాడుతూ చిలకపాలెం-రామభద్రపురం-రాయగడ వరకు ఈ నాలుగు రోడ్ల విస్తరణలో బాగా సర్వే జరుగుతున్నట్లు తెలిపారు. చిలకపాలెం నుంచి రామభద్రపురం ఆంధ్రా సరిహద్దు కూనేరు వరకు 130 కిలోమీటర్లు దూరం రోడ్డు విస్తరణలో భాగంగా సర్వే జరుగుతుందని తెలిపారు. చిలకపాలెం నుంచి రోడ్డు సర్వే గత 45 రోజులుగా చేస్తున్నట్లు తెలిపారు. 10 కిలోమీటర్ల దూరం రెండు నుంచి మూడు రోజులు వరకు సర్వే చేయడానికి సమయం పడుతుందని నిర్వాహకులు తెలిపారు. రోడ్డు మధ్య భాగం నుంచి ఇరువైపులా 45 అడుగుల చొప్పున రోడ్డుకు అవసరం ఉందని వారు చెబుతున్నారు. రోడ్డు విస్తరణ సర్వే ప్రారంభం కావడంతో పలు గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న ప్రజలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రోడ్డు విస్తరణ నాలుగు రోడ్లు అయితే తమ ఇళ్లు, దుకాణాలు తీసేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. చిలకపాలెం నుంచి రామభద్రపురం, కూనేరు వరకు 130 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ నాలుగు లైన్లు జరుగుతుందని వారు తెలుపుతున్నారు. ఏదిఏమైనా నాలుగు రోడ్ల విస్తరణ జరిగితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పలువురు అంటున్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి రక్ష

ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన పరిసర ప్రాంతాల్లో పండించే చిరుధాన్యాల ఆహార పంటలను వినియోగించడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవచ్చని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఉమాజ్యోతి అన్నారు. మండలంలోని కొత్తవలసలో శుక్రవారం ఎస్.సొసైటీ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా గర్భిణీలు, బాలింతలు, పిల్లల రక్తహీనత, కాల్షియం లోపం లేకుండా ఉంటుందన్నారు. ఎరువులేని ప్రకృతి వ్యవసాయం చేసిన ఆహార పంటలు పండించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఐసిడిఎస్ ఎక్సటెన్షన్ ఆఫీసర్ ఉషారాణి మాట్లాడుతూ మహిళలు పోషకాహారం తీసుకోవాల్సిన ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పలు ఆహార పంటలను, పిండి వంటలను ప్రదర్శనగా ఉంచారు. ఆకుకూర విత్తనాలను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, మహిళా సంఘాల విఒ అధ్యక్షులు రాజేశ్వరి, వసుంధర, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కాలువల ఆక్రమణ అధికారులకు పట్టదా?

టిడిపి నాయకుడు మావుడి

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రం సమీపంలో వెంగళరాయసాగర్ కాలువలను కొంతమంది రియల్ టర్లు ఆక్రమించుకొని కట్టడాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుడి ప్రధాన కాలువ పరిధిలోని 9ఎల్ కాలువ, ఉపకాలవలు ఆక్రమించుకొని రియల్ దందాకు కొంతమంది పాల్పడుతున్నారన్నారు. 9 ఎల్ కాలువపై ఏకంగా పక్కా కల్వర్టు నిర్మించడం అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆయకట్టు రైతులకు ఇప్పటికే పలు కాలువల్లో నీరు సక్రమంగా రావడం లేదని, ఇలా ఆక్రమణ జరిగితే పూర్తిగా నీటికి ఇబ్బందులు తప్పవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుడి ప్రధాన కాలువ పరిధిలోని 9 ఎల్, దాని ఉప కాలువలపై ఆక్రమణ వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే నిబంధన విరుద్ధంగా అనుమతులు ఇచ్చిన వారిపై రైతులంతా కలిసి న్యాయపోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు.

కుడి ప్రధాన కాలువ పరిధిలోని 9 ఎల్ కాలువ, ఉపకాలువలపై నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని విఆర్ఎస్ డిఇఇ డి.సురేష్ తెలిపారు. దీనిపై వెంటనే పరిశీలన జరిపి ఆక్రమలు తొలగించే లా చర్యలు చేపడుతామని ఆయన తెలిపారు.

పెండింగ్ డిఎలు ఇవ్వాలని నిరసన

ప్రజాశక్తి - వీరఘట్టం

పెండింగ్లో ఉన్న నాలుగు డిఎలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో వీరఘట్టంలో నిరసన, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు మండల మురళీ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలని, మెమో 57ను తక్షణమే అమలు చేయాలని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని, ఇహెచ్ఎస్ వయోపరిమితి రూ.25 లక్షలకు పెంచాలని, యాప్‌లను అసంట్మెంట్ బుక్ లేట్ విధానాలను రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రఘుమండ ధనుంజయ నాయుడు, ఎం.నరహరిరావు, బివిఎం నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొండ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బివి రమణ, గౌరవ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ ఎ.నాగరాజు, రామ్మోహన్‌రావు, జయలక్ష్మి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి శసుపు వాసుదేవరావు, గోగుల సూర్యనారాయణ తదితరులు ఉన్నారు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - వీరఘట్టం

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని మాజీ సర్పంచి జామి లక్ష్మీనారాయణ, ఎంఇఒ-2 ఆర్ ఆనందరావు క్రీడాకారులకు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరుచుకొని ఉన్నత శిఖరాలు అవలంబించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, ఖోఖో, యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథెంటిక్స్, షటిల్ వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సిహెచ్ రత్నాకర్, ప్రధానోపాధ్యాయులు కెపి నాగమణి, వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్.ఉమామహేశ్వరరావు, ఎస్ పద్మరాజు, కె.సాల్మన్ రాజ్, ధనలక్ష్మి, నాగేశ్వరరావు, చందు, రాము, రాంబాబు, అఖిల, తిరుపతినాయుడు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంతకుముందు సీనియర్ క్రీడాకారుడు ఎన్.ప్రసాదరావుకు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఘనంగా సన్మానించారు.

జై భీమ్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక డిపో ఆవరణలో జై భీమ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. పార్వతీపురం డిపో జై భీమ్ అసోసియేషన్ అధ్యక్షులుగా పి.రాజు, కార్యదర్శిగా ఎస్ రామారావు, సంయుక్త కార్యదర్శిగా ఎ.రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. దీనికిముందుగా జై భీమ్ రీజినల్ కౌన్సిల్ సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బివిఎస్ నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్ లక్ష్మణరావుకు జై భీమ్ నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు అనంతరం.ఎస్ గురవయ్య, డి విజయ సమస్యల పరిష్కారం కోరుతూ ఎఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎల్ ఆర్ రావు, పాలకొండ అధ్యక్షులు బిఎస్ రావు, జాయింట్ సెక్రెటరీ ఈ సిహెచ్ బాబు, నాగరాజు, కెఎ స్వామి, వివి రావు తదితరులు పాల్గొని నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిపిటిఒను మర్యాదపూర్వకంగా కలిశారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - కురుపాం

భర్తతో గొడవ పడి ఓ వివాహిత మృతి చెందిన విషాద సంఘటన శుక్రవారం మండలంలోని చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం కురుపాం మండలం ఏగులవాడ పంచాయతీ ఈతమానుగూడకు చెందిన మండంగి సుగన్ని (30) భర్త సురేష్‌ను మద్యం సేవించవద్దని భార్య మందలించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సుగన్ని ఇంట్లో ఉన్న మలేరియా మాత్రలు మింగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి స్థానిక మొండెంఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కురుపాం ఎస్సై పి. నారాయణరావు తెలిపారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రెబ్బగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న పాలక తిరుపతిరావు అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామం డుమ్మంగిలో మృతి చెందారు. తిరుపతిరావు క్రమశిక్షణ నిబద్ధతతో పని చేసేవారని తోటి ఉపాధ్యాయులు తెలిపారు. తిరుపతిరావు మృతి పట్ల ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ జ్ఞాన ప్రకాష్, ఎంఇఒ 1 చంద్రశేఖర్, 2 బిడ్డిక బీముడు సంతాపం తెలిపారు.